క్లుప్తంగా

గ్రామీణులకు వరం ఫ్యామిలీ ఫిజీషియన్



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తవణంపల్లె: గ్రామీణ ప్రజలకు వరం ఫ్యామిలీ ఫిజీషియన్ అని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి తెలిపారు. గురువారం తడకర, గురుకువారిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 మొబైల్ వ్యానులో రోగులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గర్భిణులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా పరీక్షలు చేయించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు శ్రీదేవి, వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల తనిఖీ



పరీక్ష కేంద్రంలో ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పబ్లిక్ పరీక్షలను ఎంపీడీఓ గౌరి గురువారం తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా జరగాలని ఎగ్జామినర్ సత్యనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మనిషికి సంపాదించిన దానిలో ఎప్పటికీ తరగనది చదువు ఒక్కటే అని తెలిపారు. కష్టపడి చదివి పరీక్ష రాయాలని విద్యార్థులకు చెప్పారు. 73 మంది విద్యార్థులకుగాను 70 మంది హాజరైనట్లు తెలిపారు.

వేలంలో రూ.28లక్షల ఆదాయం



వేలంపాటలో ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి టెండర్ ద్వారా రూ.28లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరచడానికి సంవత్సర కాలానికి లైసెన్స్ హక్కునకు బహిరంగ వేలం, సీల్ టెండర్ ద్వారా రూ.28లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కును అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ జగదీష్

చిత్తూరు అర్బన్: చిత్తూరు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మృతిచెందిన లవకుమార్ కుటుంబానికి గురువారం అడిషనల్ ఎస్పీ జగదీష్ ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్పస్ ఫండ్ నుంచి రూ. లక్ష చెక్కును మృతుడి భార్య నిర్మలకు ఆర్థికసాయం అందజేశారు. క్లర్క్ పార్థసారథి పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు రాగిజావను అందిస్తున్న హెచ్ఎం దామోదరనాయుడు

పూతలపట్టు: పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం దామోదరనాయుడు తెలిపారు. గురువారం పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండడంతో క్రమబద్ధంగా విద్యార్థులు చదవాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఉదయం ప్రార్థన సమయానికి ముందు రాగిజావను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

నేడు సైన్స్ పరికరాల కిట్ వితరణ

ఐరాల: మదనపల్లె శ్రీలక్ష్మీసరస్వతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కాణిపాకం, పుత్రమద్ది, ఎం.పైపల్లె, ముదిగోళం, నాంపల్లె, పాలకల, ఐరాల ఉన్నత పాఠశాలలకు సైన్స్ పరికరాల కిట్, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు గురువారం మోహన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ట్రస్ట్ ద్వారా పాఠశాలలకు, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

ఉపాధి..ఎవరో అపరాధి!

- ఉపాధి పథకంలో అధికారుల చేతివాటం
- బిల్లులు ఇవ్వక కూలీలతో చెలగాటం

యాదమరి: వలసలు వెళ్లకూడదని ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించి కూలి డబ్బులు ఇవ్వాలని ఆదేశించారు. కానీ పూజారులు లాంటి అధికారులు కిందస్థాయి అధికారులు చేతివాటం చేసుకున్నారు. దీంతో యాదమరి పంచాయతీలో ఉపాధి పథకంలో పనులు చేసిన కూలీలకు బిల్లులు ఇవ్వక అధికారుల బిల్లులు పెట్టలేదు. మేము చేసిన పనులకు టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ బిల్లులు పెట్టుకుని నగదు కాజేశారు. ఇదంతా తెలిసిన అధికారులు తమకేమి తెలియనట్లు వ్యవహరించడంతో కూలీలకు కోపం వచ్చి కలెక్టర్‌కు, ఎంపీడీఓకు సాక్ష్యాలతో కలిసి ఫిర్యాదు చేయడంతో అధికారులు ఇప్పుడు ప్రజాప్రతినిధుల దగ్గర పంచాయతీలు పెట్టి కాపాడాలని వేడుకుంటున్నారు. కానీ పూర్తిస్థాయిలో విచారించి నగదు కాజేసిన అధికారులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. వివరాలలోకి వెళితే..

యాదమరి పంచాయతీలోని పెరుమాళ్లపల్లె వద్దనున్న జగనన్న కాలనీ ఆనుకుని పూలకండిగ గ్రామం వరకు వర్క్ ఐడీ నంబర్ 0210056009-1సీ-జీఐఎస్-6396లో రూ.4.21లక్షల పనులు చేశామన్నారు. మొదట్లో బిల్లులు పెట్టిన తరువాత చివర్లో రెండు వారాల పనులకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ ఢిల్లీబాబు మస్టర్ బిల్లు పెట్టమన్న పెట్టలేదు. కార్యాలయంలో ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్‌ను అడిగితే పనిదినాలు అయిపోయాయని చెప్పి పంపేశారు. మరల ఫీల్డ్ అసిస్టెంట్ వారి బంధువుల పేర్లపై బిల్లులు పెట్టి నగదు డ్రా చేసి స్వాహా చేశారు. అక్కడే రెండో కాలువ పనులు 18 క్యూబిక్ మీటర్లు పనిచేసినట్లు తెలిపారు. ఆ పనులకు బిల్లులు పెట్టాలని చెప్పినా పట్టించుకోలేదన్నారు. దీనిపై అధికారులను అడిగినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఫీల్డ్ అసిస్టెంట్ వారి బంధువుల పేర్లతో మస్టర్ నంబర్లు 6077, 6078, 6079 బిల్లులు పెట్టి నగదు స్వాహా చేశారు. పీడీ తనిఖీ చేసి ఆడవారు కూలీలు లేదని గుర్తించిన అదే పనిలో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ సాయంతో ఆ కాలువ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ వారి బంధువుల్లో ఆడవారి పేర్లతో బిల్లులు స్వాహా చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఢిల్లీబాబు వలంటీర్‌గా ఉండడంతో గత సంవత్సరం రోజులుగా అతని భార్యని ఫీల్డ్ అసిస్టెంట్‌గా పెడుతున్నట్లు కింద స్థాయి అధికారులకు చెప్పి పెట్టించారు. దీంతో వారు తమ గ్రామంలో ఉన్న వారి జాబ్‌కార్డులతో రూ.లక్షల్లో బిల్లులు స్వాహా చేశారు. కానీ పనులు చేసిన కూలీలకు మాత్రం బిల్లులు ఇవ్వక అడిగితే తిట్ల పురాణాలు చెప్పడం అధికారుల వంతైంది.



బిల్లుల స్వాహాపై ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న కూలీలు

సమస్యలు రాగానే సెటిల్‌మెంట్‌లు చేసుకున్న ఉపాధి హామీ సిబ్బంది

యాదమరి పంచాయతీకి చెందిన కూలీలు కలెక్టర్‌కు, ఎంపీడీఓకు ఫిర్యాదు చేయడంపై ఏపీఓ కవితా టెక్నికల్ అసిస్టెంట్‌కు ఫీల్డ్ అసిస్టెంట్‌కు, కూలీలకు రహస్యంగా పంచాయతీ నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ బంధువులపై డ్రా చేసిన నగదు తెచ్చి ఇచ్చేయాలని సూచించారు. మీకు బిల్లులు అన్ని పెడతాం ఈ విషయం ఎవ్వరికీ చెప్పకూడదని, అలాగే ఇకపై ఎవ్వరికి ఫిర్యాదు చేయకండి చేసిన పనులకు బిల్లులు పెడతానని కూలీలకు హామీ ఇచ్చి పంపినట్లు సమాచారం.

అవకతవకలు చాలా ఉన్నాయి. వివరాలు అడిగినా ఇవ్వరు

యాదమరి పంచాయతీలో ఉపాధి పథకంలో అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ ఇష్టారాజ్యంగ బిల్లులు చేశారు. పనుల వివరాలు చెప్పి రికార్డులు అడిగిన వారు ఇవ్వలేదని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కూలీలు వాపోయారు. చివరకు మేము ఆన్‌లైన్‌లో మా పనులకు సంబంధించి ఐడీ నంబర్‌తో వివరాలు సేకరించి తీసుకపోయి అధికారులను ప్రశ్నిస్తే మాకు తెలియదు. టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ చేస్తున్నారని చెప్పుతున్నారని వాపోయారు. దీనిపై సమగ్ర విచారణ చేస్తే మరిన్ని స్వాహా చేసిన బిల్లులు బయటపడనున్నట్లు కూలీలు చెపుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు జీతం రానందున బిల్లులు పెట్టారంటా సార్

ఫీల్డ్ అసిస్టెంట్ ఢిల్లీబాబుకు జీతం రానందున అతను తెచ్చిన జాబ్‌కార్డుపేర్లపై బిల్లులు పెట్టినట్లు ఏపీఓ కవితా చెప్పారని కూలీలు చెప్పారు. మేము పనులు చేసిన మాకు బిల్లులు పెట్టక ఫీల్డ్ అసిస్టెంట్ తెచ్చిన మస్టర్‌లకు ఎలా బిల్లులు చేస్తారని ఏపీఓను, ఈసీని ప్రశ్నిస్తే టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ ఫొటోలు తెచ్చి చూపించారని, అందుకే వారిపై బిల్లులు పెట్టామని చెప్పినట్లు వివరించారు. ఇలా అయితే ఎలా పనులు చేసేది సార్ అని వారు వాపోయారు.

కార్యాలయానికి వెళ్లినా పట్టించుకోలేదు..



పనులు చేసినా బిల్లులు పెట్టలేదు. ఎన్ఆర్‌జీఎస్ అధికారుల కార్యాలయంలో అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదు. మా పనులకు సంబంధించి వివరాలు అడిగినా ఇవ్వలేదు. వేరే చోట ఆన్‌లైన్‌లో వివరాలు సేకరిస్తే మా పనులకు ఫీల్డ్ అసిస్టెంట్ బిల్లులు డ్రా చేశారు. ఏమీ చేయలేక ఎంపీడీఓకు ఫిర్యాదు చేశాం. **– శశి, కూలీ**

బిల్లులు అడిగినందుకు జాబ్‌కార్డు ఇవ్వలేదు..



బిల్లులు పెడతామని ఫీల్డ్ అసిస్టెంట్ జాబ్‌కార్డు తీసుకున్నారు, బిల్లు రాలేదు. నా కార్డు నాకు ఇవ్వాలని అడిగినందుకు నా దగ్గర లేదు. ఏపీఓను అడుగు అంటున్నారు. అధికారులు నా జాబ్ నాకు ఇప్పించాలి.

-త్యాగరాజులు, కూలీ

సమగ్ర విచారణ చేపడతాం

ఉపాధి హామీ పథకంలో అధికారులు చేసిన అవకతవకలపై ఫిర్యాదు అందింది. దీనిపై నేడో, రేపో ఉపాధి ఏపీడీ సహాయంతో విచారణ చేపడతాం. నిధులు స్వాహా చేసినట్లు తెలిస్తే వారి వద్ద ఆ నగదు స్వాధీనం చేసుకుని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం.

-ఎంపీడీఓ శివరాజ్

29న రాష్ట్రస్థాయి పోటీలు

పూతలపట్టు: ఈనెల 29న బుద్ధిమాంద్యం పిల్లలకు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ సెరిబ్రల్ పాల్సీ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు ఎస్.శివకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడలను పూతలపట్టు జెడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో జరుగుతాయని పేర్కొన్నారు. అండర్17, అండర్ 17ఆపై స్థాయి వారికి అథ్లెటిక్స్ క్రీడలు జరుగుతాయని తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పలు జిల్లాల నుంచి బుద్ధిమాంద్యం పిల్లలు పాల్గొంటారని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపొందే వారికి ప్రశంసాపత్రాలు అందజేయడంతో పాటు జాతీయస్థాయికి పంపడం జరుగుతుందని అన్నారు. మరిన్ని వివరాలకు 8328644568 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు, రేపు సిటిజన్ ఔట్రీచ్

చిత్తూరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో శుక్ర, శనివారాల్లో సిటిజన్ ఔట్రీచ్‌ను విధిగా నిర్వహించాలని ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి గడపలోకి వెళ్లి సర్వే పూర్తిచేయాలని చెప్పారు. సర్వేలో పొందుపరిచిన అంశాల ఆధారంగా వాటిని పకడ్బందీగా నమోదు చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

నేడు క్షయదినోత్సవ అవగాహన ర్యాలీ

చిత్తూరు రూరల్: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరులో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి రవిరాజు తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఆపై సమావేశం ఉంటుందని, అధికారులు, సిబ్బంది హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేక పూజలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం వళ్లియప్పనగర్‌లోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన కుంభాభిషేక పూజలు గురువారం ప్రారంభయ్యాయి. ఉదయం గోపూజ, మహాగణపతి హోమం, నవగ్రహ హోమం, లక్ష హోమం, మహాపూర్ణాహుతి అంకురార్పణం, రక్షాబంధనం, ప్రధాన కలశ పూజ, యోగశాల పూజ, పూర్ణాహుతి, దీపారాధన పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

క్షయ నిర్మూలనకు కృషిచేద్దాం

బంగారుపాళెం: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ సమష్టిగా కృషిచేద్దామని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్రాయన్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి ప్రమాదకరమైన వ్యాధికాదని అన్నారు. వ్యాధి ప్రారంభ దశను గుర్తించి క్రమం తప్పకుండా చికిత్స చేసుకున్నట్లయితే పూర్తిగా నయం అవుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ విజయకుమారి మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి క్షయవ్యాధికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అపోలో ఫౌండేషన్ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి ఆర్థికసాయంతో క్షయవ్యాధి గ్రస్తులు 100 మందికి పౌష్టిక ఆహార ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు. ఆరు నెలల పాటు పౌష్టిక ఆహార ప్యాకెట్లు అందజేస్తామని ఫౌండేషన్ ప్రతినిధి తెలిపారు. ఎంపీహెచ్ఈఓ బృహస్పతి, డీపీఎంఓ మణి, ఐసీటీసీ కౌన్సిలర్ బాబు పాల్గొన్నారు.



క్షయ రోగులకు పౌష్టికాహార ప్యాకెట్లను అందజేస్తున్న వైద్యులు

వినాయకుని విగ్రహం ఊరేగింపు

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన కర్పగ వినాయకస్వామి ఆలయంలో ప్రతిష్ఠించే వినాయకుని విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. రెండు దశాబ్దాల క్రితం యాదమరి మెయిన్ బజార్‌లో నిర్మించిన కర్పగ వినాయకస్వామి ఆలయంలో స్వామివారి మూలవిరాట్ విగ్రహం చిటికిన వేలు విరిగిపోవడంతో ఆ విగ్రహం స్థానంలో మరో విగ్రహాన్ని గురువారం రాత్రి ప్రతిష్ఠించడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ప్రతిష్ఠించే స్వామివారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర మంగళహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



పురవీధుల్లో విహరిస్తున్న వినాయకస్వామి

రాగిజావ పంపిణీపై హర్షం



రాగిజావ ఇస్తున్న పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు

యాదమరి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడానికి రాష్ట్ర ప్రభుత్వం రాగిజావ అందించడంపై మండల పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. గురువారం కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి వారు రాగిజావ అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా మంచి పోషకాలతో కూడిన చిక్కీలు, మూడు రోజులు రాగిజావ, మూడు రోజులు కోడిగుడ్లు, ఐదు రోజులు పాటు మెనూ ప్రకారం భోజనాలు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, షూలు, అమ్మఒడి పథకం కింద రూ.15వేలు విద్యా ర్థుల తల్లుల ఖాతాలో జమ చేయడం సంతోషం అని హర్షం వ్యక్తం చేశారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సంఘం నేతలు కనకాచ్చారి, సురేష్‌రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, హిమబిందు పాల్గొన్నారు.

మైనారిటీల అభ్యున్నతికి సర్కార్ కృషి

చిత్తూరు కలెక్టరేట్: మైనారిటీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ గఫార్‌ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నూతనంగా జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వసీమ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ విలేకరులతో మాట్లాడుతూ రంజాన్ మాసంలో మైనారిటీలకు అవసరమైన అన్ని సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మైనారిటీ శాఖ అధికారులు, నగర కమిషనర్, విద్యుత్‌శాఖ అధికారులు అన్ని మసీదుల్లో సౌకర్యాలు ఏర్పాటు చేశారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే 9440003784, 9885099188 నంబర్‌లకు తెలియజేయాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఫిరోజ్, అక్రమ్, జునైద్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గఫార్‌ఖాన్

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

చిత్తూరు రూరల్: ముస్లింలకు పవిత్రమైన అతిపెద్ద పండుగ రంజాన్. ఈ మాసాన్ని పురస్కరించుకుని చిత్తూరులో శుక్రవారం నుంచి సుదీర్ఘ ఉపవాస దీక్షలను ముస్లింలు చేపట్టనున్నారు. అలాగే సూర్యోదయానికి ముందే సహరీ, సూర్యాస్తమయం తర్వాతనే ఇఫ్తార్ ఆహారాన్ని స్వీకరించనున్నారు. 30 రోజుల అనంతరం నెలవంకను చూసిన మరుసటి రోజు పండుగ పర్వదినాన్ని సంతోషంగా నిర్వహించుకోనున్నారు. రంజాన్ మాసం ప్రారంభం కావడంలో నగరంలోని అన్ని మసీదుల వద్ద నిర్వాహకులు ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తిచేశారు.

వేలంలో రూ.5.96 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి కుసుమకుమారి

ఐరాల: పాలకల పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఆదాయ వనరులైన సంత, షాపింగ్ గదులు, ప్రైవేట్ బస్సుల నుంచి రుసుం వసూలుకు నిర్వహించిన వేలంలో పంచాయతీకి రూ.5 లక్షల 96 వేలు ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి కుసుమకుమారి తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసులు శ్వేత, వాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులు వేగవంతం



గృహనిర్మాణ పనులపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ, డీఈ

బంగారుపాళెం: మండలంలో గృహనిర్మాణ పనులను అధికారులు సకాలంలో పూర్తిచేయాలని డీఈ సుబ్రమణ్యారెడ్డి, ఎంపీడీఓ హరికృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏప్రిల్ 15లోపు గృహనిర్మాణ పనులను లబ్ధిదారుల చేత పూర్తిచేయించాలన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏఈ గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కారం



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయభాస్కర్

పూతలపట్టు: మండలంలోని పాలకూరులో దారి సమస్యను తహసీల్దార్ విజయభాస్కర్ గురువారం పరిష్కరించారు. 30 అడుగుల వెడల్పుగల దారిని ఓ వ్యక్తి ఆక్రమించుకుంటే వాటిని సర్వే చేయించి ఊరి దారి సమస్యను పరిష్కరించారు. మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా న్యాయసేవలు అందిస్తాం

గుడిపాల: పేదలకు ఉచిత న్యాయసేవలు అందించేందుకు ఎల్లప్పుడూ తాము సిద్ధంగా ఉన్నట్లు సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. గురువారం చిత్తపార పంచాయతీలోని రాయల్‌చేను ఎస్టీ కాలనీలో షీల్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రమాదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు న్యాయసేవలను ఉచితంగా అందజేస్తామన్నారు. ఎవ్వరూ కూడా ఆందోళన చెందవద్దని ప్రభుత్వం ఎప్పుడు న్యాయసేవలను అందించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. కొంతమంది కోర్టులంటే భయపడతారని ఆ భయాన్ని వీడాలన్నారు. అనంతరం కాలనీ వాసులు ఇళ్లు, సీసీ రోడ్లు కావాలని ఆయన్ని కోరారు. తాము కట్టుకున్న ఇళ్లకు ఇంటి పట్టాలను అందజేయాలని తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీడీఓ ఉపేంద్ర, ఏఎస్ఐ మునివేలు, సర్పంచ్ రవి, పంచాయతీ కార్యదర్శి శివ, వీఆర్‌ఓ సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కరుణకుమార్

చిరుధాన్యాల్లో మంచి పోషకాలు

తవణంపల్లె: చిరుధాన్యాల్లో మంచి పోషకాలు కలిగి ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రెడ్డికల్యాణి తెలిపారు. మండలంలోని మత్యంలో గురువారం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో 'పోషన్ పక్వాడ' కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ రెడ్డి కల్యాణి మాట్లాడుతూ స్థానికంగా లభించే చిరుధాన్యాల్లో మంచి పోషక విలువలు ఉంటాయని వివరించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు సైతం చిరుధాన్యాలు తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కల్పించారు. పోషన్ పక్వాడ కార్యక్రమం ఏప్రిల్ 3వ తేదీ వరకు ప్రతి పంచాయతీ చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. హెచ్ఎం నరసింహులు మాట్లాడుతూ జంక్ ఫుడ్ తినడం వల్ల పిల్లలు అనారోగ్యం పాలవుతారని వివరించారు. చిరుధాన్యాలైన అలసందలు మొదలైనవి పిల్లలకు తినిపించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందిరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు విద్య, నిర్మల, రామలక్ష్మి, వినాయక, గర్భవతులు, బాలింతలు, తల్లులు, కిశోరబాలికలు పాల్గొన్నారు.



మత్యంలో చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం

సమాజ అభివృద్ధికి ఎన్ఎస్ఎస్ కృషి

తవణంపల్లె: సమాజ అభివృద్ధికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కృషిచేయాలని వెంగంపల్లె హైస్కూల్ హెచ్ఎం మోహన్ రెడ్డి సూచించారు. వెంగంపల్లెలో గురువారం అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం నిర్వహించిన ప్రత్యేక శిబిరాన్ని సర్పంచ్ రాజేశ్వరమ్మ, హెచ్ఎం మోహన్‌రెడ్డి, నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ద్వారా వారం రోజులపాటు వెంగంపల్లెలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వలంటీర్లు పాల్గొన్నారు.



వెంగంపల్లెలో శిబిరం ప్రారంభిస్తున్న హెచ్ఎం మోహన్ రెడ్డి

జర్నలిస్టులకు అండగా ఉండాలి

చిత్తూరు కలెక్టరేట్ : జర్నలిస్టులకు ప్రభుత్వాలు అండగా ఉండాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ లోకనాథ్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా పలుచోట్ల జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రత్యేక చట్టాలను ప్రభుత్వాలు అమలుచేయాలని వారు కోరారు. సేవ్ జర్నలిజం డేను పురస్కరించుకుని గురువారం చిత్తూరులోని కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల సమస్యల పట్ల ఆయన సానుకూలంగా స్పందించారని నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు మురళీకృష్ణ, చిత్తూరు ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

భార్గవికి డాక్టరేట్

చిత్తూరు కలెక్టరేట్: నగరానికి చెందిన భార్గవికి టోక్యో యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, దొడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న కల్పన దంపతుల కుమార్తె భార్గవి టోక్యో యూనివర్సిటీలో జియోటెక్నికల్ విభాగంలో పరిశోధన నిర్వహించింది. డాక్టరేట్ సాధించిన ఆమెను వారి కుటుంబీకులు, స్నేహితులు అభినందించారు.



డాక్టరేట్ పొందిన భార్గవితో తల్లిదండ్రులు